# ఔన్నత్యం

రిక్షా నీడ్వలేక ఈడిగిలపడుతూ అప్పుడప్పుడు వెనుకకు తిరిగి చూస్తున్నాడు మహమూద్. అతడు వెనుకకు తిరిగి చూస్తున్నప్పుడల్లా రిక్షాలో కూర్చున్న విశ్వేశ్వరావుకు గుండె జల్లుమంటుంది.— లాల్చి జేబులో వున్న పర్సును తడిమి చూసుకుంటున్నాడు ..

' ఈ రిక్షావాళ్ళు మోసగాళ్ళుంటారు తన దగ్గరున్న ఐదువేల రూపాయలను వీడు గుంజుకొని కొడితె— ? బక్కచిక్కినట్టున్న వీడు తన మీద గెలుస్తాడా? అబ్బో ఈ అలగా జనాలను నమ్మకూడదు వీళ్ళకు బలమంతా బొక్కల్లోవే వుటుంది—అయిత్రే వీడు తనను మోసం చేస్తాడా? అయినా తన దగ్గర డబ్బున్నట్టు వీడికెట్లాతెలుసు? బాబోయ్ వీళ్ళు దేవాంతకులు. ఆవులిస్తే పేగుల్లెక్కబెడతారు తన తడబాటును చూసే వీడు డబ్బుందని గ్రహించి మాటి మాటికి వెనుకకు తిరిగి చూస్తున్నాడు... లేకుంటే వీడికేమవసరం? అయిత్రే వీడు తన దగ్గర వున్న డబ్బు లాక్కుంటాడా? ఆ వీడేటి రిక్షాను సందులోకి తీసుకెల్తున్నాడు—? పైగా చీకటి ఈ రోజు ఉదయం తానెవ్వరి ముఖం చూసాడో...? ఈ డబ్బు సురక్షితంగా చేరాల్సిన చోటికి చేరితే తాను వెంకటేశ్వర స్వామికి కొబ్బరికాయ కొడతాడు? జేబులో వున్న పర్సును మాటి మాటికి తడిమి చూసుకుంటూ రకరకాలుగా ఆలోచిస్తున్నాడు విశ్వేశ్వరావు

ఆప్పుడే రిక్షానో సందులోకి తింపిన మహమూద్‌తో—

"సందులో కెందుకోయ్ రిక్షా పోనిస్తున్నావ్"? అన్నాడు

"ఇట్ల పోతేనే దగ్గరుంటుది సాబ్ .." అని అలాగే పోనిస్తున్నాడు మహమూద్. అతని మాసిన గడ్డం, గళ్ళాగుంగి, లూజుగా వున్న బొట్ల బొట్ల అంగి విశ్వేశ్వరావ్ కళ్ళకు భయంకరంగా కనబడుతున్నాయి.

"ఈ కూటికి లేని జనాలే దొంగతనాలు చేస్తారు హత్యలు చేస్తారు మోసాలు చేస్తారు...వీళ్లకో నీతుండదు — నిజాయితుండదు అయిత్తే వీడు తనను కొడ్తతాడా? కొట్టి డబ్బు లాక్కుంటాడా? వీళ్ళకొన్ని సం కేత స్థలాలుంటాయంటారు — ఆ స్థలాలకెళ్లి రిక్షా ఆపుతారట అక్కడ వీళ్ళ మనుషులుంటారు. వీడలా చేస్తే? తన డబ్బుకు తిలోదకాలివ్వాల్సిం దేనా? ఈ రోజు తన రాత బాగా లేదు ... ఈ రోజే స్నేహితునికివ్వా ల్సిన డబ్బు ముట్టజెప్పాలని తాను బయలుదేరాలా? చూడు చూడుమని బస్సు ఈ రోజే ఆలస్యంగా రావాలా? స్నేహితునిల్లు ఇంకొద్ది దూరం లోనే వుంది అబ్బో ఇక్కడ చాలా చీకటిగా ఉందేంటి—? అదిగో దూరం నుంచి వీని అనుచరులు వస్తున్నట్టున్నారు అరపనా? అరిస్తే చం పేస్తారేమో? పోగా మనుష్య సంచారం కూడ లేదు— అయితే తానేం చేయాలి"? అనుకుంటుండగానే రిక్షా ఆగింది...

"ఏంటోయ్ రిక్షా ఆపావు" ప్రశ్నించాడు విశ్వేశ్వర్రావు.

"చెయిన్ పడింది సాబ్" అని వెనుక చక్రం వద్ద వంగాడు మహ మూద్ — "వీడు తననేదో చేసేట్టున్నాడు. ఇప్పుడు పారిపోతే – ? అను కుంటూ వుండగానే దూరం నుంచి వస్తున్న మనుషులు రిక్షాను దాటుతూ వెళ్లిపోయారు. మహమూద్ రిక్షా ఎక్కి తొకు తున్నాడు.

"చెయిన్ పడిందని నాటకమాడి డబ్బు గుంజుకోవాలనుకున్నాడు వీడు...కాని ఆ ఎదురొచ్చే మనుషులు తన వాళ్లు కాకపోవటం చేత వదలిపెట్టాడు. ఎలాగైనా ఈ రోజు తన ఐదువేలు పొయ్యేట్టున్నాయి" తనలో తానే తర్జన భర్జన చేసుకుంటూ మహమూద్ దిక్కు అనుమా నంగా, భయంగా చూస్తూ కూర్చున్నాడు రావ్ – ఎడమ చేతిని ఎడమ జేబులో ఉన్న పర్సుపై పెట్టి కుడిచేతిని రిక్షా సీటు క్రిందికి పోనిచ్చాడు చేతికి కాగితాల్లా తగిలాయి – పైకి తీసాడు — మహమూద్ చెమటోడ్చి సంపాదించుకున్న యాభై రూపాయలు అతని చేతిలోకొచ్చాయి—

"ఈ డబ్బు తాను తీసుకుంటే ! పాపం వాడు కష్టపడి సంపాదించాడు అయినా డబ్బు దగ్గర పాపం పుణ్యం లెక్కేంటి? వీడీ డబ్బు ఎవర్నో మోసం చేసే సంపాదించుటాడు వాడెలా సంపాదించినా ఉత్త పుణ్యానికి లభిస్తున్న ఈ డబ్బును వదులుకోవడం తెలివి తక్కువతనం. వీడేంటి మళ్ళీ రిక్షా ఆపుతున్నాడు? లేదు—లేను—ఎత్తు గడ్డొచ్చిందని నిల్చొని మెల్లగా తొక్కుతున్నాడు. అమ్మయ్య ఇల్లు దగ్గరికొచ్చేసింది. తన ఐదువేలు పోతాయనుకుంటే తనకే యాభై రూపాయలు లభించాయి. వెదవకు మంచి శాస్తే జరిగింది—అనుకుంటూ ఆ యాభై రూపాయలు కుడిజేబులో పెట్టుకున్నాడు రావ్.

రిక్షానాపి మహమూద్‌కు మూడు రూపాయలిచ్చి స్నేహితునింటిలోకెళ్ళి ఎడం దిక్కు జేబులో చెయ్యిపెట్టిన విశ్వేశ్వర్రావ్ ''నా పర్సు పోయింది'' అని కేకేసాడు. వెనుకకు తిరిగి బజారులో కొచ్చాడు

''వెధవ తన పర్సు కొట్టేశాడు. పోలీస్ కాంప్లెంటిచ్చి మక్కెలిరగ తన్నియ్యాలి, ఆ రిక్షావాడి ముఖం తనకు తెలుసు'' తనలో తాను గొనుక్కుంటూ గబగబా నడుస్తున్నాడు విశ్వేశ్వర్రావ్... కొంత దూరం పోయేసరికి రిక్షాతో మహమూద్ ఎదురయ్యాడు—అతన్ని చూసి రిక్షా ఆపాడు .."సాబ్! మీ పర్సు రిక్షాలో పడిపోయింది. మీకిచ్చేత్తామని తిరిగొస్తున్న—పర్సునట్ల పెట్టుకుంటే ఎట్లాసార్—ఆండ్ల పైసలు సరిగున్నయో లేదో సూసుకోండి'' అంటూ పర్సు రావు చేతికిచ్చాడు—

కూటిక్కూడ లేని మహమూద్ తనకు లభించిన ఐదువేల రూపాయలను తిరిగి ఇచ్చేస్తుంటే ధనవంతుడై యుండి కూడా యాభై రూపాయలకు కక్కుర్తిపడిన విశ్వేశ్వర్రావ్ స్థానుపై నిల్చున్నాడు. తన అభిప్రాయాలు తల క్రిందులు కాగా, చిరిగిన బట్టలతో, బక్కచిక్కిన దేహముతో ఉన్న పేద రిక్షవాడు మహమూద్ ఔన్నత్వం ముందు తల వంచక తప్పలేదు విశ్వేర్వరావ్‌కు...

విశ్వరచన పక్షపత్రిక డిసెంబర్ 1986 రెండవపక్షం.

# వారసత్వం

వంటపని ముగించి గోడకు వీపు నానించి కూర్చుంది నర్సమ్మ. ఆమె ముఖంపై ఆవేదన ...విచారం—ఆలోచనలన్నీ కొడుకు కోడలు గురించే..."ఒక్కడే పొల్లగాడు-కడుపుల పెట్టొకొని సాదిన ...పానం కంటేకోక్కా సూసుకున్న—బ్రతుకు దెరువులేక గంత దూరం పోతనన వట్టె...దేశంగాని దేశం భీమఁడి బతుక పోతనంటండు. బుక్కెడు బువ్వకోసం ఎయిల మైళ్ళ రాజ్జెంగాని రాజ్జెం మరాట దేశం పోవాల్సి రావట్టె. అక్కడ మన మనుషులు గాపెయిరి మన మాటగాపాయె—ఎంత జెప్పిన ఇంటలేడు కొడుకు ఒక్కడన్నవోక మల్ల పోర్ని గూడ తోలుకపోతంనంటండు. ఎట్లెల్ల దీత్తడో కొడుకు,, ఆలోచిస్తూ హృదయం భారం కాగా కళ్ళనొత్తుకుంది. ఆమెకు సమీపంలోనే నులక మంచములో కూర్చొనున్న మొండయ్యా భార్య ముఖంలోని వేదనను గమనిస్తున్నాడు. అతని ముఖంలోనూ అంతులేని ఆవేదన. కొడుకును బీమండి పోవద్దని తాను చేసిన ప్రయత్నాలన్ని విఫలం కాగా ఒప్పుకోక తప్పలేదు మొండయ్యకు ఇక్కడ బ్రతుకు తెరువు కరువై రాష్ట్రాన్నే వదలి పోతున్న కొడుకునుగూర్చి బాధపడుతున్నాడు సైకిల్ పై బట్టల ముల్లెలు పెట్టుకొని తిరిగమ్మే వాళ్ళ సంఖ్య బాగా కావడం వల్ల ఇక బేరం నడవడంలేదు... బీమండి పోవడానికే నిర్ణయించుకుని ఈ రోజే ప్రయాణపుతున్నాడు. ఒకప్పుడు తాను మాత్రమేం చేస్తాడు? మగ్గం నేసి బ్రతకడం సాధ్యం కాక అమ్మ-నాన్నలు కన్నీరు కారుస్తుండగా పోలేదా? జీవితాన్నంతా మర మగ్గాలకే అంకితం చేయలేదా? మొండయ్యా తన